క్లుప్తంగా

బోథ్ వ్యవసాయాధికారిగా భగత్ రమేశ్

బోథ్: బోథ్ మండల వ్యవసాయాధికారిగా భగత్ రమేశ్ బదిలీపై వచ్చారు. ఆదిలాబాద్ అర్బన్‌లో ఇదివరకు ఏవోగా విధులు నిర్వర్తిచిన భగత్ రమేశ్ బోథ్ ఏవోగా బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన వెండి విశ్వామిత్ర ఆదిలాబాద్ అర్బన్ మండలానికి బదిలీ అయ్యారు.

పనిచేసే వారికే గుర్తింపు

ఇచ్చోడ: అంకితభావంతో పని చేసే వారికే గుర్తింపు ఉంటుందని ఎంపీపీ ప్రీతంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ అధికారిగా రామారావు పదవి విరమణ చేసిన సందర్భంగా మాట్లాడారు. గత 6 సంవత్సరాలుగా ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారిగా ఉన్నతమైన సేవలు అందించారని గుర్తు చేశారు. పలువురు రామారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇచ్చోడ మాజీ ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

2న జాతీయ జెండా ఆవిష్కరించాలి

ఇచ్చోడ: ఈనెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించాలని ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాల ఎదుట ఉదయం 8.15 నిమిషాలకు జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు లేని పాఠశాలలో కూడా జెండా ఆవిష్కరించే విధంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

'రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం'

బోథ్: మండలంలోని ప్రధాన రహదారిపై గల పొచ్చెర వంతెన, సాయినగర్ వంతెన, కోర మాండల్ వద్ద ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు, వా హనదారులు నానా అవస్థలు పడుతున్నారని 'వా మ్మో.. గుంతలు' శీర్షికన శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో రోడ్డు, భవనాల శాఖ అధి కారులు స్పందించారు. ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్ మూడు రోజుల్లో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

నేషనల్ మార్ట్‌లో తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లోని నేషనల్ మార్ట్‌లో శుక్రవారం తూనికలు కొలతల శాఖ అధికారి అబ్దుల్ జలీల్ తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాల కోసం సిద్ధంగా ఉంచిన ఐదు రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. త్రివేణి, విజయ ఆయిల్, ఫాలుదా, ఫ్రూట్స్ ప్యాకెట్లపై ఎమ్మార్పీ ధర ముద్రించిన కొలతల్లో తేడాలు ఉండడంతో కేసు నమోదు చేశారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

ఆదిలాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆదిలాబాద్ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దయాకర్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో నాణ్యమైన పత్తి విత్తనాలు దొరకక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో లేక పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కావాలని రైతులను రెచ్చగొట్టి బీజేపీ నాయకులు ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించడం సరికాదని హితవు పలికారు. సమావేశంలో నాయకులు దినేష్ మాటోలియా, చిత్ర ధరంపాల్, భూమారెడ్డి, సోమ రవి, సచిన్, నిఖిల్, అర్జున్ పాల్గొన్నారు.

మేలైన వంగడాలు ఎంపిక చేసుకోవాలి

తలమడుగు: రైతులు నేలకు అనువైన, నీటివసతి కలిగిన సాగు భూమిలో మేలైన వంగడాలు ఎంపిక చేసుకొని పంటల సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో పత్తిసాగుపై అవగాహన కల్పించారు. రైతులు మేలైన వంగడాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఒకే రకమైన వంగడాలు సాగు చేయకుండా వివిధ రకాల వంగడాలకు చెందిన విత్తనాలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శివ చరణ్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత ప్రవీణ్ కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: కేయూ పరీక్షల విభాగంలో విద్యార్థులను పాస్ చేసేందుకు కొంతమంది అడ్డదారి తొక్కుతున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల జవాబు పత్రాలు మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.5వేలు తీసుకొని బుక్‌లెట్లను మార్చుతున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు పాల్గొన్నారు.

అమాయక రైతులే టార్గెట్

- నకిలీ విత్తనాలతో బురిడీ
- అవగాహన లేక మోసపోతున్న రైతులు
- ప్రభుత్వం ద్వారానే విత్తనాలు పంపిణీ చేస్తేనే మేలు



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ: దేశానికి అన్నం పెట్టే రైతన్ననే మోసం చేస్తూ.. వారి అమాయకత్వాన్ని, అవసరాన్ని ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. అచ్చం కంపెనీ పేరుతో ఉండే విత్తనాల ప్యాకెట్లను రైతులకు అమ్ముతున్నారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు తయారు చేస్తూ.. రైతులను ఆదిలోనే నిండా ముంచుతున్నారు.

జోరుగా నకిలీ విత్తనాలు....

ఆదిలాబాద్ జిల్లా తెల్ల బంగారం పండించడంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. అలాంటి తెల్ల బంగారం నకిలీ విత్తనాలను జిల్లాల్లో భారీగా తయారు చేస్తున్నారు. ఇటీవలే పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాల తయారీ చేస్తుండగా పట్టుకున్నారు. ఇలా నకిలీ విత్తనాల దందా చేస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. మండల వ్యాప్తంగా అధికసంఖ్యలో గిరిజన రైతులే ఉండడంతో దళారుల మాటలు నమ్మి వారి ఏ విత్తనాలు ఇస్తే వాటినే విత్తుతున్నారు. విత్తిన తరువాత అవి మొలకెత్తకపోవడంతో మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. ఇలా ఒక్క పత్తి విత్తనాలే కాకుండా రైతులు పండిచే కందులు, జొన్నలు, మొక్కజొన్నలు, వరి వంటి విత్తనాలను నకిలీ చేసి, మార్కెట్లో బడా వ్యాపారం చేస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- లైసెన్స్ కలిగిన డీలర్ షాపు వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.
- బిల్లులను తమ వద్ద జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తనాల బ్యాగులపై లెబుల్ చూసి, వాటిపై ఉన్న తయారీ డేట్, కంపెనీ పేరు, అడ్రస్‌ను చూసుకోవాలి.
- విత్తనాలపై అవగాహన లేని వారు వ్యవసాయాధికారులను సంప్రదించాలి. దీంతో నకిలీ విత్తనాలను అరికట్టవచ్చు.

నిఘా పటిష్టం చేయాలి..

నకిలీ విత్తనాలను అరికట్టాలంటే రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. విత్తనాలను కొనుగోలు చేసే ముందు వ్యవసాయాధికారులను రైతులు కలిసేలా అందుబాటులో ఉండాలి. ఒకే రకం విత్తనాలను విత్తుకోకుండా రైతుల పంట భూములను పరిశీలించి వారికి ఆ భూమిలో ఎలాంటి విత్తనాలు వేస్తే అనుకూలంగా ఉంటాయో వివరించాలి. అలాగే నకిలీ విత్తనాలు అరికట్టడం కోసం వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు, ఇతర అధికారులు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి.

దళారుల వద్ద కొనుగోలు చేయవద్దు



లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేశాక తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. గ్రామాల్లో తిరిగే దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు.

– జాదవ్ కైలాస్, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

కఠిన చర్యలు తీసుకోవాలి



రైతులను నకిలీ విత్తనాలను అంటగట్టే దళారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లో నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు విత్తన దుకాణాలను తనిఖీ చేయాలి.

– ఓరగంటి లస్మన్న, రైతు, సిరికొండ

అవగాహన కల్పించాలి



రైతులకు ముందుగానే నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి. మార్కెట్లోకి నకిలీ విత్తనాలు రాకుండా చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాలు గుర్తించేలా ప్రతీ రైతుకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలి.

– సిడాం శంకర్, రైతు, రిమ్మ గ్రామం

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఎదులాపురం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఈనెల 2న పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సీపీఐ పాత్ర విశేషమైందన్నారు. సాయుధ పోరాటం నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు జరిగిన పోరాటాల్లో సీపీఐ పాల్గొందన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో గెలిచిన కేసీఆర్ ఏనాడు తెలంగాణ పోరాట యోధులను గుర్తించింది లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నళినీరెడ్డి, కుంటాల రాములు, అరుణ్‌కుమార్, గేడం పొచ్చిరాం పాల్గొన్నారు.

రోడ్డుపైకి వరదనీరు రాకుండా చూస్తాం



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: త్రివేణిసంఘం చెరువు వరద నీరు రోడ్డుపైకి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ సమీపంలోని చెరువును పరిశీలించారు. చెరువు కట్ట, వరద నీటి ప్రవాహం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్తడి కింద ఉన్న కోతకు గురైన ప్రధాన రహదారిని పరిశీలించారు. రోడ్డు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జాదవ్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని భోయవాడకాలని, ఎన్టీఆర్‌నగర్, హనుమాన్‌నగర్, మేదరివాడ, మోబీన్‌పుర కాలనీల్లో ఉదయం ఎమ్మెల్యే పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు (మార్నింగ్ వాక్) కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి, డ్రెయినేజీ, కరెంటు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను గుర్తించడం జరిగిందని, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత..

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేణునగర్‌లోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయుఆరోగ్యాలతో చల్లగా ఉండాలని వేడుకున్నారు.

ఘనంగా అయిలబాయి జయంతి

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో కురుమ, యాదవ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాజమాత అయిలబాయి హోళ్‌కార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అయిలబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిపుంగే సంజయ్, గొల్ల కురుమ యాదవ సంఘాల మండల సభ్యులు గోరే విశాల్, పోత్లే అమోల్, నిపుంగే యశ్వంత్, నిపుంగే గణేష్, కాలే శంకర్, గోహర్కర్ రాజు, నిపుంగే వైభవ్ పాల్గొన్నారు.

చిన్నుగూడలో తీరిన నీటి కష్టాలు

- పైపులైన్, నల్లాలు ఏర్పాటు చేయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



నీటిని పట్టుకుంటున్న ఆదివాసీ మహిళలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చిన్నుగూడ నీటి సమస్య తీరింది. ఈనెల 22న సాక్షిలో ప్రచురితమైన 'చిన్నుగూడలో నీటి గోస' అనే కథనానికి కలెక్టర్‌తో పాటు, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ సురేందర్‌లు గ్రామాన్ని సందర్శించి నీటి వసతి కల్పించారు. గ్రామానికి సమీపంలోని భీంజీగూడలోని భగీరథ ట్యాంక్ నుంచి చిన్నుగూడ వరకు పైప్‌లైన్ వేశారు. నల్లాలు ఏర్పాటు చేసి నీళ్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. నీటి సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన పత్తి విత్తనాలే కొనాలి



తనిఖీ చేస్తున్న ఏవో రమేశ్



తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

బోథ్: రైతులు నాణ్యమైన, గుర్తింపు పొందిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని బోథ్ వ్యవసాయ విస్తరణ అధికారి ఆడెపు కృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. గుర్తింపు పొందిన డీలర్ నుంచి విత్తనాలను కొని, సరిపడా బిల్లును తీసుకోవాలని సూచించారు. మండలంలో రైతులకు సరిపడా విత్తనాలు ఉన్నాయన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వండి

నార్నూర్: రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని ఏవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. గిరిజన గ్రామాల్లో ఎక్కడైనా గుర్తు తెలియని వ్యక్తులు నకిలీ విత్తనాలు అమ్మినా.. గ్రామాలకు వచ్చినా.. పోలీసులకు, వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏఈవో సాయి ఉన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

తాంసి: మండలంలోని కప్పర్ల, పొన్నారి గ్రామాల్లోని విత్తన దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. షాప్‌లో నిల్వ చేసిన విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలన్నారు. వారి వెంట ఏడీఏ రవీందర్, ఎస్సై శివరాం, తహసీల్దార్ లక్ష్మీ, ఏఈవోలు శివ, యోగిరాజ్, వెంకటేశ్ ఉన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ జాడి కృష్ణ

ఇంద్రవెల్లి: మహిళ సంఘాల సభ్యులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ జాడి కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని అంద్‌గూడ గ్రామంలోని మహిళ సంఘాలకు రూ. 18 లక్షల చొప్పున రూ. 54 లక్షల రుణం మంజూరు చేశారు. ముందుగా బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్, వీవోఏ జుగ్నాక్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం కావాలి



కుట్టు మిషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శేషారావు

బోథ్: స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్డీఏ పెన్షన్ విభాగం డీపీఎం, బోథ్ మండల ప్రత్యేకాధికారి శేషారావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తొమ్మిది క్లస్టర్ల పరిధిలో స్వయం సహాయక మహిళా సంఘాలకు చెందిన కుట్టు మిషన్ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల దుస్తులను మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం కుట్టిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవ్, మహిళా సంఘం అధ్యక్షురాలు ప్రమీల, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్, సీసీలు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరం సందర్శన



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని వికాసం ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధి కారిణి ఖుష్బూ గుప్తా శుక్రవారం సందర్శించారు. ప్రతీ రోజు పిల్లలకు ఆట పాటలతో పెయింటింగ్, డ్రాయింగ్ శిక్షణ ఇవ్వాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ప్రతీ రోజు ఉదయం పాలు బిస్కెట్లు, పండ్లు అందచేయాలన్నారు. కార్యక్రమంలో వికాసం పాఠశాల ప్రిన్సిపాల్ వికాస్, ఎస్సీఆర్పీ బలరాం, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

'బడిబాట' విజయవంతం చేయండి

- మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్



మాట్లాడుతున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ కోరారు. ఈనెల 3నుంచి 19 వరకు జరగనున్న బడిబాట కార్యక్రమ నిర్వహణపై ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బందితో మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బడిబాట విజయవంతానికి చేపట్టాల్సిన కార్యచరణను సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌లను సైతం అందజేయాలని సూచించారు. సమావేశంలో మండల విద్యాధికారి జయశీల, టీఎంసీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, ఎంఈవో నారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉచిత విద్య, పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, నిష్ణాతులైన సిబ్బందితో బోధన మౌలిక వసతులను తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

నేరడిగొండ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో బడిబాటపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు బడిబాట నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించాలని, ఈనెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్, వనజ, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బేల: ఈనెల 3 నుంచి 19 వరకు నిర్వహించనున్న బడిబాటను విజయవంతం చేయాలని ఎంఈవో గంగుల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కోల నర్సింలు, కుర్ర రమేశ్, జాడి సుదర్శన్, అంగన్‌వాడీ పర్యవేక్షురాలు సుజాత, మంజుషా, మిస్ కోఆర్డినేటర్ మితున్‌కుమార్, సీఆర్పీలు వెంకన్న, విజయ్, రేణుక పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, జూన్ 3 నుంచే చేపట్టే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మోహన్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, స్వయం సహాయక సంఘం సభ్యులు, వీవోఏలు, సీఆర్పీలు, ఎస్ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎస్సై శివరాం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భీంపూర్‌లో బడిబాట సమావేశం..

భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో ఆధ్వర్యంలో బడిబాట సమావేశం నిర్వహించారు. వీవోఏలు, అమ్మ ఆదర్శ కమిటీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బడిబాటపై అవగాహన కల్పించారు. బడీడు పిల్లలు తప్పకుండా పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో సమీర్, నోడల్ ఆఫీసర్ శ్యాంసుందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్

నార్నూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామి కావాలన్నారు. పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ నాందేవ్ చౌహాన్, సూపర్‌వైజర్ సత్తవ్వ, రాజమ్మ, ఏఎన్ఎంలు సుశీల, మాన్కుబాయి, ఈశ్వరి, విమల, శీల, విద్యా, జంగుబాయి పాల్గొన్నారు.